క్లుప్తంగా

రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యం

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలం దరికీ కుళాయిల ద్వారా రక్షిత మంచినీరు అందించడమే సీఎం జగన్ లక్ష్యమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న మంచినీటి పైపులైన్ పనులను సోమవారం ఎంపీపీ పరిశీలించారు. త్వరలో మంచినీటి పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, కుసుమ శ్రీనివాస్, అప్పన శ్రీను, మట్టా వెంకటేశ్వరరావు, చప్పిడి సుబ్రమ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ముంపునీటి సమస్యకు పరిష్కారం

మామిడికుదురు: నగరం గ్రామంలో ఆర్‌బీకే ఎదురుగా ఉన్న రహదారిపై నిలిచి పోతున్న ముంపునీటి సమస్యను సోమవారం స్థానికులు, పంచాయతీ సిబ్బంది పరిష్కరించారు. రోడ్డుపై నిలిచిపోతున్న ముంపునీరు అక్కడి నుంచి బయటకు వెళ్లే విధంగా కచ్చా డ్రైన్ ఏర్పాటు చేశారు. 216వ నంబర్ జాతీయ రహదారి నుంచి నగరం మూడో వీధి వరకు ఉన్న లింకు రోడ్డుపై ఏటా ముంపు నీరు భారీగా నిలిచిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి ముంపునీరు నిలిచి పోవడం వల్ల దోమలు పెరిగిపోయి, దుర్గంధంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య ఎంతో కాలంగా వేధిస్తోంది. కచ్చా డ్రైన్ ద్వారా ఈ ముంపునీరు బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించాలి

రాజోలు: విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించాలని విద్యుత్‌శాఖ ఏఈ సీహెచ్ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. మీటరు రీడింగ్ తీసిన 15 రోజుల్లోగా బిల్లు చెల్లిస్తే ఎలాంటి అపరాధ రుసుం విధించరన్నారు. నెల రోజులు దాటిన తర్వాత కూడా బిల్లు చెల్లించక పోతే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని, తదుపరి రీ-కనెక్షన్‌కు అదనంగా రూ.100 చార్జీ చెల్లించవలసి ఉంటుందన్నారు. విద్యుత్ బిల్లులను నేరుగా విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో గాని, మీ-సేవ, ఆన్‌లైన్ పేమెంట్ యాప్‌ల ద్వారా కూడా చెల్లించవచ్చన్నారు.

ఘనంగా చండీహోమం

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో సోమవారం చండీహోమం జరిగింది. ఆల య కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఉండవల్లి వీర్రాజు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన దాసరి సుబ్బారావు భక్తుల కోసం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి

పి.గన్నవరం: నియోజకవర్గ బహుజన సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షురాలిగా ఊడిమూడి ఎంపీటీసీ సభ్యురాలు అయినపర్తి ఇందిరా ప్రియదర్శిని తిరిగి నియమితులయ్యారు. పి.గన్నవరంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్టీ శ్రేణులు, సీనియర్ నాయకుల సహకారంతో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడు బడుగు సాయిబాబు, జంగా కృష్ణమూర్తి, జిత్తుగ సత్యనారాయణ, గుత్తాల రమణ, వడ్డి వీరాస్వామి, గణపతిరావు, కోనాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా అబ్బులు



నియామక పత్రాన్ని అందుకుంటున్న అబ్బులు

ఆలమూరు: జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా ఆలమూరు మండలం కలవచర్ల గ్రామానికి చెందిన తాతపూడి అబ్బులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు అమలాపురంలో హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కార్యాలయంలో సోమవారం జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. జిల్లాల విభజన అనంతరం తొలిసారిగా జరుగుతున్న సమావేశంలో నూతనంగా ఎంపికైన ప్యానల్ సభ్యులందరూ రాష్ట్ర నేతల సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు.

సామాజిక రక్షణకు దిశ యాప్

అంబాజీపేట: వ్యక్తిగత, సామాజిక రక్షణ కోసం ప్రతి ఒక్కరి ఫోన్‌లో దిశ యాప్ ఉండాలని జిల్లా దిశ డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. తొండవరం జెడ్పీ హైస్కూల్‌లోని విద్యార్థులకు దిశ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని హెచ్‌ఎం పీవీ కేశవాచార్యులు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సైలు ఎ.చైతన్యకుమార్, కనకదుర్గ, పీఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఉపాధ్యాయుల సాయం

రావులపాలెం: అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినికి ఉపాధ్యాయులు, కళాశాల సిబ్బంది సాయం అందజేశారు. ఆలమూరు మండలం చెముడులంకకు చెందిన మీసాల శ్రావణికుమారి స్థానిక జూనియర్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. ఆమె నివసిస్తున్న ఇల్లు కాలిపోయిన విషయం తెలిసిందే. సోమవారం ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ ఆదేశాలతో ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది విద్యార్థిని ఇంటికి వెళ్లి, రెండు జతల యూనిఫాం, నిత్యావసరాలు, కొంత నగదు అందజేశారు.

జగనన్న సురక్షతో ప్రజల వద్దకే సేవలు

- ఉత్సాహంగా జరుగుతున్న కార్యక్రమం
- పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాల అందజేత



పెదపట్నంలంకలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: ప్రభుత్వ సేవలను ప్రజలకు ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. పెదపట్నంలంకలో సోమవారం జరిగిన జగనన్న సురక్షలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రెండు సచివాలయాల పరిధిలోని 1469 మందికి పలు రకాల సర్టిఫికెట్లను చిట్టిబాబు అందజేశారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఉచితంగా సచివాలయాల్లోనే సేవలు పొందే అవకాశం సురక్ష ద్వారా ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సురక్ష కార్యక్రమం నిరంతరంగా జరుగుతుందన్నారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరనీడి చిన్ని, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, జేసీఎస్ మండల కన్వీనర్ జక్కంపూడి వాసు, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: గ్రామ సచివాలయం-2 పరిధిలో సోమవారం «జగనన్న సురక్ష» శిబిరం నిర్వహించారు. శిబిరం టీమ్ అధికారి, తహసీల్దార్ జీడీ కిషోర్ బాబు అధ్యక్షతన జరిగిన సభలో అముడా చైర్మన్ దేవిడ్‌రాజు, ఎంపీపీ రమాదేవి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అర్హులై ఉండి లబ్ధి పొందని అర్హులందరూ ఈ జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వివిధ ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ దంగేటి సుబ్రహ్మణ్యం, గ్రామ కార్యదర్శి వీవీ రామన్ తదితరులు పాల్గొన్నారు. పలివెల సచివాలయం-1లో ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ మార్గన గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. వివిధ ధ్రువపత్రాలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, దేవస్థానం, ధర్మసత్రం చైర్మన్‌లు భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ, చప్పిడి సాయిబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు తులా సూర్యనారాయణ, డీటీ ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పలు సమస్యలను పరిష్కరించేందుకు వీలు కలుగుతుందని శివకోటి, రాజోలు సర్పంచ్‌లు నక్కా రామరావు, రేవు జ్యోతిలు అన్నారు. సోమవారం శివకోటి-2 సచివాలయం వద్ద ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణ, రాజోలు-2 సచివాలయం వద్ద తహసీల్దారు బీఎం ముక్తేశ్వరరావుల ఆధ్వర్యంలో ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను మంజూరు చేశారు. రెండు సచివాలయాల పరిధిలో సుమారు 3,500 ధ్రువపత్రాలను అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు భట్రాజు కోటయ్య, ఎం.రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి-1 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహించారు. రెండు సచివాలయాల పరిధిలో సుమారు 1000 మంది ప్రజలు పాల్గొనట్టు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. లక్ష్మీపోలవరంలో 410 ధ్రువపత్రాలు, పొడగట్లపల్లి-1లో 620 ధ్రువప్రతాలను అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమాల్లో గ్రామ సర్పంచులు హెచ్.హేమలత, గంధం దేవి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, తహసీల్దారు మృత్యుంజయరావు, కార్యదర్శులు బ్రహ్మజీ, సుభాష్ పాల్గొన్నారు.



పలివెలలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ గంగాధరరావు

ఆలమూరు: రాష్ట్రంలోని అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పాటు సత్వర సేవలను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్షకు విశేష స్పందన లభిస్తుందని జగనన్న సురక్ష మండల ఇన్‌చార్జిలు తమ్మన శ్రీనివాస్, నామాల శ్రీనివాసు అన్నారు. మండలంలోని మూలస్థాన అగ్రహారం-2, నర్శిపూడి గ్రామ సచివాలయ పరిధిలో సర్పంచ్‌లు లంక వరప్రసాదరావు, కందిబొట్ల శ్రీనివాసు అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరాల ఏర్పాటు జరిగింది. తహసీల్దార్ ఏపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్ లింకన్ నేతృత్వంలో రెండు అధికార బృందాలు అర్హులైన లబ్ధిదారులకు 11 రకాల ధ్రువపత్రాలను మంజూరు చేశారు. రెండు గ్రామాలకు సంబంధించి 1238 మంది లబ్ధిదారులకు గాను తక్షణమే 1171 మంది సమస్యలను పరిష్కరించి అక్కడికక్కడే ధ్రువపత్రాలను మంజూరు చేశారు. ఉప సర్పంచ్ చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, కార్యదర్శులు పాలింగి రాజు, ఆర్‌వీవీ సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలను వెలకట్టలేం

నాకు చాలా కాలంగా ఆరోగ్యశ్రీ కార్డు లేదు. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్లను మా వలంటీర్ కుడకా పోలేశ్వర నాగవెంకట సత్యనారాయణ ఇంటికి వచ్చి దరఖాస్తు చేశారు. దీంతో నాకు ఆరోగ్యశ్రీకార్డు వచ్చింది. అలాగే ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారక ముందే నాకు పింఛను రూ.2,750 తీసుకొచ్చి అందిస్తాడు. నా భర్త చనిపోయి చాలా ఏళ్లు అయింది. అయితే ఆయన డెత్ సర్టిఫికెట్ లేక ఫించన్ వచ్చేది కాదు. డెత్ సర్టిఫికెటు దరఖాస్తు చేశారు. దీంతో నాకు ఇప్పుడు ఫించన్ క్రమం తప్పకుండా వస్తోంది.



బొంతు పూర్ణమ్మకు ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న వలంటీర్

వరదల సమయంలో విస్తృత సేవలు

గతేడాది మా పొట్టిలంక వరద ముంపునకు గురైనప్పుడు వలంటీర్ పాము శేషవాణి తన పరిధిలోని 70 మంది కుటుంబాల వారు గుర్తు చేసుకుంటారు. గ్రామంలో పీకల్లోతు వరద నీటిలో నా పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వం అందించిన భోజన ప్యాకెట్లు, మంచినీటి బాటిళ్లు, నిత్యావసరాలు, స్వచ్ఛంద సంస్థలు ఇచ్చిన వస్తువులు అందిస్తూ నా లబ్ధిదారుల ప్రశంసలు పొందాను. ఇందుకు గాను ప్రభుత్వం సేవా వజ్ర అవార్డుతో సత్కరించి, రూ.30 వేలు బహుమతి ఇచ్చింది.



పొట్టిలంకలో గతేడాది వరదలో వృద్ధుడికి ఆహారం అందజేస్తున్న వలంటీర్ శేషవాణి

జగన్ పాలనలో విప్లవాత్మక మార్పులు



తూర్పుపాలెంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. సోమవారం తూరుపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులతో కలసి ఎమ్మెల్యే రాపాక ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు ఆయన వివరించారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వం నుంచి అందించే వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదన్నారు. జగన్ పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుంటే ప్రతిపక్షాలు ఈర్ష్య పడుతున్నాయని పేర్కొన్నారు. జగన్ పాలనలో కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందన్నారు. ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరేలా ప్రభుత్వ పథకాలను రూపొందించి అమలు చేస్తున్న జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీర బ్రహ్మాజీరావు, తాడిచర్ల కేశవరావు, గుండుమేను నారాయణమూర్తి, యెనుముల నారాయణస్వామి, అడబాల చినబాబు, కొల్లాబత్తుల అశోక్‌కుమార్, అడబాల పవన్, కార్యదర్శి ఎస్‌డీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహాక్షేత్రాల సందర్శనం సర్వపాపహరణం



మందపల్లిలో భక్తులకు ఆశీస్సులు అందజేస్తున్న బాలబ్రహ్మానంద సరస్వతి స్వామి

కొత్తపేట: దేవతామూర్తులతో ప్రతిష్ఠించిన, స్వయంభూ వంటి మహాక్షేత్రాల సందర్శనం సర్వపాపహరణం అని నైమిశారణ్య మహాదేవ పీఠాధిపతి, హిందూ ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు బాలబ్రహ్మనంద సరస్వతి స్వామి అన్నారు. దేశ వ్యాప్తంగా ధర్మ పథం పేరిట ప్రముఖ పుణ్యక్షేత్రాల సందర్శనలో భాగంగా సోమవారం మందపల్లిలో ఉమా మందేశ్వర (శనైశ్చర) క్షేత్రాన్ని సరస్వతీస్వామి సందర్శించి స్వామికి, పార్వతీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం, శనైశ్చర క్షేత్ర మహత్యం, ప్రవచనములు వివరించారు. పిల్లలకు చిన్నప్పటి నుంచీ నమస్కారమనే సంస్కారం నేర్పించాలని సూచించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలతో ఫలాలు అందజేశారు. దేవస్థానం, గ్రామం తరఫున బాలబ్రహ్మనంద సరస్వతిని ఈఓ సింగం రాధ, వీడీసీ కన్వీనర్ సాదు చెంచయ్య ఘనంగా సత్కరించారు. దేవస్థానం మాజీ చైర్మన్ చింతం విజయకృష్ణమోహన్, వైఎస్సార్ సీపీ నాయకులు అడపా అబ్బులు, తోరాటి గణేష్, చింతం సత్తిబాబు, దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

దేహ దారుఢ్యానికి క్రీడలు అవసరం

అంబాజీపేట: ఆత్మరక్షణతో పాటు దేహ దారుఢ్యానికి క్రీడలు ఎంతో అవసరమని తైక్వాండో బ్లాక్ బెల్ట్ ఎగ్జామినర్ బి.అర్జునరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో తైక్వాండో క్రీడాకారులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లు సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఎల్లో, ఎల్లో 1, గ్రీన్, గ్రీన్ 1, బ్లూ, బ్లూ 1, రెడ్ బెల్ట్‌ల గ్రేడింగ్ సంబంధించి 100 మంది బెల్ట్ గ్రేడింగ్ పొందారు. కార్యక్రమంలో భూషణం, కె.దుర్గారావు, బి.కుసువీర్, మణికుమార్ భార్గవి శ్రీకళ పాల్గొన్నారు. అనంతరం ఇటీవల జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సిల్వర్ మెడల్స్ సాధించిన పితాని భార్గవిశ్రీకళ, వైష్ణవిలకు న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఆధ్వర్యంలో చెరో రెండు వేల నగదును బహుమతిగా అందజేశారు. సీఐ డి.ప్రశాంత్‌కుమార్ క్రీడాకారులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

కులాల మధ్య చిచ్చు రేపడమే వారి అజెండా



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సత్కరిస్తున్న పార్టీ నేతలు

మామిడికుదురు: కులాల మధ్య చిచ్చు రేపి, గొడవలు సృష్టించి వాటి నుంచి లబ్ధి పొందాలన్నదే జనసేన అధినేత పవన్‌కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అజెండా అని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈదరాడ చాకిరేవు చెరువుగట్టు ప్రాంతంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చేట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను స్థానికులు ఘనంగా సత్కరించారు. పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. ఇజ్రాయిల్ మాట్లాడుతూ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పవన్‌కు తగదన్నారు. ప్రజల నుంచే వలంటీర్లను ఎంపిక చేశారని గుర్తు చేశారు. వారిని సంఘ విద్రోహ శక్తులుగా మాట్లాడటం, వారి మనోభావాలను దెబ్బతీయడం సరికాదన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన నేత పవన్ చేస్తున్న చవకబారు రాజకీయాలకు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత మాదిగలకు గుర్తింపునిచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, పార్టీ నేతలు యెరుబండి సూరిబాబు, బొలిశెట్టి భగవాన్, సూరిశెట్టి బాబి, కొడమంచిలి సాయికుమార్, కనపాల బాబూరావు, కుసుమ పెరుమాళ్లకుమార్, ముసూడి అబ్బులు, వడ్డి ఆదిబాబు, పాలమూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించాం



మాచవరంలో లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: రాష్ట్రంలో పేద ప్రజల ఆకాంక్షలను గుర్తించి, వలంటీర్ల ద్వారా సంక్షేమ, పథకాలను ఇంటింటికీ అందిస్తున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యంలో మాచవరంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సోమవారం వివరించారు. ఏ ఇంట్లో ఏఏ పథకాల ద్వారా ఎంత మేరకు లబ్ధి చేకూరిందో వివరించారు. ఇంకా అర్హత ఉన్నా రాకుండా ఏమైనా సంక్షేమ పథకాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్నో సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందామని అధికారులు చెప్పక ముందే ప్రజలు తమ ముందుకు వచ్చి ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇటువంటి సీఎం తమకు మళ్లీ రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నట్లు చెబుతున్నారన్నారు. ప్రజల నుంచి సమస్యలు వచ్చిన వెంటనే అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, మైలా ఆనందరావు, కుసుమ శ్రీను, పితాని శెట్టి, కొర్లపాటి కోటబాబు, కుసుమ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు పురస్కారాలు

రాజోలు: సోమిశెట్టి ఆంజనేయులు నాగలక్ష్మి (ఎస్‌ఏఎన్) ఫౌండేషన్ సేవలు అభినందనీయని పలువురు అన్నారు. సోమవారం సాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాటిపాకలోని సోమిశెట్టి ల్యాండ్ మార్క్ హాలులో సాన్ ప్రతిభా పురస్కారాలు అందజేశారు. సివిల్స్‌లో అత్యుత్తమ ర్యాంక్ సాధించిన యర్రంశెట్టి రమణి (ఈదరాడ), నీట్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించిన కోళ్ల మధురిమ (రాజోలు), ఇటీవల పదో తరగతి పరీక్షల్లో మండలంలో మొదటి స్థానంలో నిలిచిన సీహెచ్ యశ్విత (సఖినేటిపల్లి), ఐ.హర్షిత (మలికిపురం), ఎ.అంజనిపూర్ణిమ(రాజోలు), పి.వైష్ణవి (మామిడికుదురు), సీహెచ్ నాగవసంత (మామిడికుదురు), ఎస్.ఐశ్వర్య (పి.గన్నవరం)లకు ప్రతిభా పురస్కారాలు పొందారు. సాన్ వ్యవస్థాపకులు సోమిశెట్టి ఆంజనేయులు విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, ఎంపీపీ కేతా శ్రీనివాస్, తాటిపాక సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, పార్టీ నాయకుడు గుబ్బల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి నారుమడులు

ఆత్రేయపురం: వర్షాలు కురవడం, కాలువలకు సాగునీరు ఒక్కసారిగా విడుదల చేయడంతో మండలంలోని ర్యాలి మీడియం డ్రైన్ వద్ద ర్యాలి, మెర్లపాలెం, లొల్ల గ్రామాల్లో నారుమడులు నీట మునిగాయి. దీంతో ఆ రైతులంతా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వద్ద తమ సమస్యలు ఏకరవు పెట్టారు. సుమారు 400 ఎకరాల్లో నారుమడులు నీటమునిగాయని వాపోయారు. కాలువలకు సాగునీరు విడుదల తగ్గించాలని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వద్దకు సమస్యను తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి డ్రైన్స్, ఇరిగేషన్ అధికారులను వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. డ్రైన్స్ డీఈ నాగార్జునరావు, ఏఈ వెంకట్రాజు, ఇరిగేషన్ ఏఈ పిల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో డ్రైన్స్, ఇరిగేషన్ సిబ్బంది రైతులతో పాటు సందర్శించారు. రైతులు స్వచ్ఛందంగా ర్యాలి వద్ద ఉన్న మీడియం డ్రైన్‌లో పూడికతీత పనులు చేపట్టారు. అధికారులు పరిశీలించి 200 క్యూసెక్కుల నీటిని తగ్గించారు. డ్రైన్స్ డీఈ మాట్లాడుతూ ర్యాలి మీడియం డ్రైన్ వద్ద క్రాస్ బండ్‌లు ఏర్పాటు చేసి పైపులైన్లు శుభ్రం చేయిస్తామని హామీ ఇచ్చారు. త్వరితగతిన పనులు చేయిస్తామన్నారు. కొత్తపేట మండలం పలివెల నుంచి లొల్ల వరకు 17 కిలోమీటర్ల పంట కాలువలు పటిష్ట పర్చేందుకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆదేశాలతో రూ.3.50 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిపారు. వచ్చే వేసవి నాటికి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో రైతులు శాంతించారు.

అర్హత ఉన్న అందరికీ సంక్షేమ పథకాలు



వెదిరేశ్వరంలో లబ్ధిదారులకు పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: అర్హత ఉన్న అందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వెదిరేశ్వరంలో గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. జగ్గిరెడ్డికాలనీ, రాళ్లగండి ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ వెదిరేశ్వరంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి బీసీ లబ్ధిదారులకు రూ.19.12 కోట్లు, ఎస్సీ లబ్ధిదారులకు రూ.2.95 కోట్లు, ఎస్టీ లబ్ధిదారులకు 46.82 లక్షలు, మైనారిటీ లబ్ధిదారులకు 12.75 లక్షలు, కాపు లబ్ధిదారులకు రూ.కోటి 22 లక్షలు, ఇతర సామాజిక వర్గాల లబ్ధిదారులకు రూ.9.61 కోట్లు, మొత్తంగా గ్రామంలో రూ.33.50 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. అంతేకాకుండా గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేశామన్నారు. 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణం చివరి దశలో ఉందని దానిని కూడా అతి త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గన్నవరపు వెంకట్రావు, సర్పంచులు బొక్కా కరుణాకరం, దొమ్మేటి అర్జునరావు, అంబటి సుబ్బలక్ష్మి, వాడపల్లి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, మాజీ వైస్ ఎంపీపీ దండు సుబ్రహ్మణ్య వర్మ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మల్లిడి రామిరెడ్డి, చాంబర్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ఆలమూరు: గ్రామంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరించారు. కృష్ణాజిల్లా అవనిగడ్డకు చెందిన న్యాయవాది గోరిపర్తి శ్రీనివాసరావును గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడటాన్ని నిరసిస్తూ కోర్టు ఆవరణలో ఆందోళన చేపట్టారు. న్యాయవాదులపై తరచూ జరుగుతున్న దాడులను నిరసిస్తూ దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ప్రారంభం




వెదిరేశ్వరంలో వాటర్ ట్యాంక్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: మండలంలోని వెదిరేశ్వరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జగ్గిరెడ్డి కాలనీలో జల్ జీవన్ మిషన్‌లో రూ.99 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్, ఇంటింటికీ ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయి కనెక్షన్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ప్రజలకు గోదావరి జలాలు తాగునీరుగా అందించాలనే ఉద్దేశంతో సుమారు రూ.1700 కోట్లతో వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేసే పనులకు అంకురార్పణ జరుగుతుందన్నారు. అది కార్యరూపం దాల్చిన తరువాత ఆలమూరు మండలానికి కూడా గోదావరి జలాలు మంచినీరుగా అందిస్తామన్నారు.

పలువురికి ఎమ్మెల్యే సాయం

గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా వెదిరేశ్వరంలో పర్యటించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. మెదడు పెరుగుదల సరిగా లేకుండా జన్మించిన పసిపాప యోగక్షేమాలు అడిగి తెలుసుకుని తల్లి గుబ్బల దుర్గకు రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న దూనబోయిన ఏడుకొండలును పరామర్శించి వైద్య ఖర్చులకు రూ.5 వేల సాయం అందించారు.

కవి సుబ్బారావు రచనలు విజ్ఞానదాయకం



కొత్తపేటలో కవి సుబ్బారావు-సుశీల దంపతులను సత్కరిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ తదితరులు

కొత్తపేట: ప్రముఖ కవి గిడ్డి సుబ్బారావు రచనలు విజ్ఞానదాయకమని, మార్గదర్శకాలని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్ అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల తెలుగు, ఇంగ్లీషు శాఖాధిపతులు పి.శివాజీ, ఎ.దీపికాదేవి సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు సమీపంలోని కవి, రచయిత సుబ్బారావు స్వగృహాన్ని, ఆయన రచనల గ్రంథాలయాన్ని సందర్శించారు. సుబ్బారావు రచనలను చదివి, విశ్లేషించారు. ముఖ్యంగా బియ్యపు గింజ, కోనసీమ సంస్కృతి వంటి రచనలను చదివి వాటిలో పలు అంశాలను, సందేహాలను అడిగి తెలుసుకోవడం ద్వారా నివృత్తి చేసుకున్నారు. కవి సుబ్బారావు మాట్లాడుతూ పుస్తక పఠనాన్ని విద్యార్థులు, యువకుల్లో పెంపొందించాలని, వారి భావి జీవితానికి దోహదపడాలన్నదే తన ఆశ, ఆకాంక్ష అని అన్నారు. తన సాహితీ జీవితానికి, ఈ పుస్తకాలు సంరక్షణ విషయంలో తన సతీమణి సుశీల సహకారం ఎంతో ఉందన్నారు. కళాశాల తరఫున అధ్యాపకుడు, కవి గిడ్డి సుబ్బారావు-సుశీల దంపతులను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు.

పెయింటింగ్ వర్కర్లను ఆదుకోవాలి

మలికిపురం: పెయింటింగ్ వర్కర్లను ఆదుకోవాలని కోరుతూ నియోజకవర్గ పెయింటర్లు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావుకు వినతిపత్రం అందించారు. సోమవారం కత్తిమండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ మేరకు కలసి తమ ఇబ్బందులను తెలియజేశారు. నియోజకవర్గంలో ఉన్న వందలాది మంది పెయింటర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, భవన నిర్మాణ ముడి సామగ్రి ధరలు పెరగడంతో నిర్మాణపనులు నత్తనడకన సాగుతుండటంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వివిధ వర్గాలను ఆదుకుంటున్న విధంగా తమను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సీఎం జగన్‌కు సమస్య వివరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దేవ రాజేంద్రప్రసాద్, మందపాటి రాజేశ్వరరావు, వినోద్, ఎడ్ల నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రోత్సాహకానికి రూ.2 లక్షల చెక్కు

రాజోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రోత్సాహకానికి సోంపల్లి గ్రామానికి చెందిన కాచీభొట్ల రామకృష్ణ పరమహంస రూ.2 లక్షల చెక్కును ప్రిన్సిపాల్ పి.సాయిబాబాకు సోమవారం అందజేశారు. కాచీభొట్ల మాణిక్యాంబ జ్ఞాపకార్థం అందించిన లక్ష రూపాయల డిపాజిట్‌పై వచ్చిన వడ్డీ రూ.5 వేలను బీఎస్సీలో టాపర్‌గా నిలిచిన ఎం.నీరజరమణికి అందజేశారు. అలాగే కట్టా తాతయ్య జ్ఞాపకార్థం అందించిన లక్ష రూపాయల డిపాజిట్‌పై వచ్చిన వడ్డీని ఆర్ట్స్, కామర్స్ విభాగంలో అత్యధిక మార్కులు సాధించిన కె.చందనకు అందజేశారు. ఐబీఎం బెంగళూరు సంస్థలో విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ పరమహంస కుమారుడు కె.వి.సూర్యనారాయణమూర్తి ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు.

కృష్ణంరాజు చిత్రపటం వద్ద నివాళులు

సఖినేటిపల్లి: రాజోలు మాజీ ఎమ్మెల్యే అల్లూరు కృష్ణంరాజు చిత్రపటం వద్ద సోమవారం పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఈ మేరకు సఖినేటిపల్లిలోని ఆయన నివాస గృహం వద్ద చిత్రపటానికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి నివాళులర్పించారు. వీరితో పాటు రొటేరియన్ కేవీ రామకృష్ణంరాజు, వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, పరిషత్ కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, అమలాపురం కౌన్సిలర్ నాగేంద్ర, జాన శంకరరావు, సరెళ్ళ విజయ్ ప్రసాద్, కనుమూరి పండురాజు, వేగిరాజు సాయిరాజు, దొమ్మేటి ఉమా మహేశ్వరరావు, యెనుముల ఆనంద్‌కుమార్ తదితరులు ఉన్నారు.